క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

గన్నేరువరం: మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందిన తరువాత తొలిసారిగా ఆదివారం గన్నేరువరం మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పారువెల్ల, ఖాసీంపేట గ్రామాల్లోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీమానసాదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించనున్నారు. అలాగే కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం పాల్గొంటారు. అనంతరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ అవరణలో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొననున్నారు.

వెదిర వాసికి డాక్టరేట్


రఘునందన్‌రెడ్డి

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన పన్యాల రఘునందన్‌రెడ్డి మహాత్మాగాంధీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఎడ్యుకేషన్ పై ప్రత్యేకంగా పరిశోధనలు చేసి సమర్పించడంతో యూనివర్సిటీ వారు డాక్టరేట్ అందజేశారు. ఈసందర్భంగా రఘునందన్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోగల సురభి కాన్వెంట్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయినట్లు కరస్పాండెంట్ వీరేశం పేర్కొన్నారు. అండర్- 14 విభాగంలో దీప్తి, ఎ.వర్షిక, కె.అశ్విత, సీహెచ్.హర్షిణి, ఐ.శ్రీజ, కె.స్వాతి, అండర్- 17 విభాగంలో పి.అనుష్క, ఎండీ ఆస్మా, జి.లహరిక, ఆర్.సందీప్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ వీర నర్సయ్య, పీడీ పుల్కం మహేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మినీ రైస్‌మిల్ పరిశీలన


రైస్‌మిల్లును పరిశీలిస్తున్న డీఈ తదితరులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామ శివారు పరిధిలో గల మినీ రైస్‌మిల్లును రామగుండం కాలుష్య నియంత్రణ మండలి డీఈ భిక్షపతి శనివారం పరిశీలించారు. గ్రామ శివారులోని పంట పొలాల్లోకి తవుడు, ఊక పడుతుందని, కూరగాయల సాగుకు ఇబ్బంది అవుతుందని దాసారపు శారద ఇటీవల కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఈ రైస్‌మిల్ పరిసరాలను పరిశీలించారు. సాగు చేసే భూమిలో తవుడు, ఊకతో జరిగిన తీవ్ర నష్టాన్ని అధికారులు గుర్తించారు. రైస్‌మిల్ యజమాని వద్ద పొల్యూషన్ సర్టిఫికెట్ ఉందా లేదా అనే విషయమై అధికారిని ప్రశ్నించారు. కూరగాయలకు నష్టం వాటిల్లకుండా తెర ఏర్పాటు చేసుకోవాలని రైస్‌మిల్ యజమానికి అధికారులు సూచించారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలి

హుజూరాబాద్‌రూరల్ : రాష్ట్రంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ప్రకటనలో కోరారు. మైనార్టీ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూముల రక్షణకు పటిష్ట చర్యలు చేపటాలన్నారు. మసీదులలో పనిచేస్తున్న ఇమామ్ మోజాన్‌లకు ప్రతినెలా రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏలు, ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ అమలు చేయాలని పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ రహదారిపై ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైనాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం జాగీర్‌పల్లికి చెందిన కంది రవీందర్‌రెడ్డి కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో రవీందర్‌రెడ్డికి గాయాలైనాయి. చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు.

మోటారు కాలుతోంది

- నరిపోని ఎస్‌ఎస్-8 ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ
- పుష్కలంగా సాగునీరున్నా నిరుపయోగమే..
- మొరాయించి కాలిపోతున్న కరెంట్ మోటార్లు
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న రైతులు

గంగాధర: వ్యవసాయ బావుల్లో పైపైకి భూగర్భ జలాలు.. పంట పొలాల సమీపంలో గల వరదకాలువలో పుష్కలంగా నీరున్నా సాగుకు నిరుపయోగమే అవుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ లో వోల్టేజీ సమస్యతో మోటార్లు మొరాయించి తరుచూ కాలి పోతున్నాయి. కరెంటు మోటారు నడిస్తే కాలువ పారక ముందే బందవుతుందని, పోసిన నారుమడులు పారించడానికి రాత్రిపూట పంపుల వద్దకు వెళ్లాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. సమస్య పరిష్కరించడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కరెంటు సిబ్బందిని వేడుకుంటున్నారు.

సప్లై సరిపోక..

కురిక్యాల రెవెన్యూ గ్రామ పరిధి కొండన్నపల్లి శివారు వరద కాలువ సమీపంలోని ఎస్‌ఎస్-8 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతుల కరెంటు కష్టాలు వర్ణనాతీతం. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినప్పుడు 5 హెచ్‌పీ కనెక్షన్లు 13 ఉండగా ప్రస్తుతం 22 కనెక్షన్లకు పెంచారు. దీంతో కరెంటు మోటార్లకు పవర్ సప్లై సరిపోక మోటార్లు మొరాయించడంతో పాటు తరుచూ కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్కలంగా నీరున్నా పంటపొలాలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ప్రతి రైతు అదనంగా 3 హెచ్‌పీలకు డీడీలు చెల్లించాలని విద్యుత్ అధికారులు డిమాండ్ చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సమస్య పరిష్కరిస్తేనే పంటల సాగుకు నోచుకుంటాయని అంటున్నారు. కరెంట్ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


కొండన్నపల్లి గ్రామ పరిధిలోని ఎస్‌ఎస్-8 ట్రాన్స్‌ఫార్మర్

పదిసార్లు వైండింగ్ చేయించా



విద్యుత్ సరఫరా సమస్యతో మోటార్లు మొరాయించి తరుచూ కాలిపోతున్నాయి. రెండు కరెంటు మోటార్లు ఉంటే రెండు సంవత్సరాల్లో పదిసార్లు వైండింగ్ చేయించా. వైండింగ్ చేయించినప్పుడల్లా 25 వందల నుంచి మూడు వేల రూపాయల ఖర్చు అవుతుంది. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కరెంటోల్లను వేడుకుంటున్నం.

– అంజయ్య, రైతు, కొండన్నపల్లి

నారుమడులు పారుతలేవు



వచ్చిరాని కరెంటుతో పాటు, లోవోల్టేజీ సమస్యతో నారుమడులు పారుతలేవు. అందరు రైతులు దున్నుడు మొదలు చేయకముందు దున్నిన పొలాలు ఆరిపోతున్నాయి. రైతులు పంటల సాగు చేయకముందే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

– కిషన్, రైతు, కొండన్నపల్లి

సీపీఎస్ రద్దు ప్రకటన హర్షణీయం

- టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

గన్నేరువరం: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం హర్షణీయమని టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని గుండ్లపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 1,70,000 సీపీఎస్ ఉద్యోగులు వారి కుటుంబాలు ఆనందోత్సంతో ఉన్నారని తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 2004 తరువాత నియామకమైన ఉద్యోగులకు సీపీఎస్ విధానం అమలవుతోందని, చాలా మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొంది పెన్షన్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి సైతం పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీపీఎస్ రద్దుకు అనేక సమయాల్లో అసెంబ్లీలో ప్రస్తావించినా గత ప్రభుత్వం స్పందించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎస్ ఉద్యోగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు యాద రవి, బూట్ల మల్లికార్జున్, వనిత, మాధవి, దీపారాణి పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఐదెకరాల వరకు రైతుబంధు వర్తింపజేయాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

హుజూరాబాద్: రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని ఐదెకరాల వరకు సాగు చేస్తున్న పేద, సన్నకారు, కౌలు రైతులకు మాత్రమే వర్తింపజేయాలని శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రైతుబంధులో మిగిలిన మొత్తంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్ర కులాల్లోని పేద వర్గాల పిల్లలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, ఖాలీద్ హుస్సేన్, చందుపట్ల జనార్దన్, డాక్టర్ తడికమళ్ళ శేఖర్, విష్ణు దాస్ గోపాల్‌రావు, కొలిపాక సమ్మయ్య, ఎలబోతారం మాజీ సర్పంచ్ నమిండ్ల రవీందర్, వేల్పుల ప్రభాకర్, రామ్‌రాజేశ్వర్, మిడిదొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆర్థిక స్థితిగతులపై విద్యార్థుల సర్వే

హుజూరాబాద్: పట్టణంలోని పలు ఏరియాల్లో శనివారం హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం విద్యార్థులు పలు అంశాలపై సర్వే నిర్వహించారు. తెలంగాణలో సామాజిక, ఆర్థిక స్థితిగతుల మీద డిజిటలైజేషన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులు సమగ్ర సర్వే చేపట్టారు. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో డిజిటలైజేషన్ తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సహాయకులు డా.రావుల కృష్ణ ఆధ్వర్యంలో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు సాక్షి, పోపీదేవి, ఫణీందర్, పిట్ట నర్సింగ్ బృందం సర్వే చేపట్టింది.


హుజూరాబాద్‌లో సర్వే చేస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులకు బట్ట సంచుల పంపిణీ


బట్ట సంచులతో ఉపాధ్యాయులు

చొప్పదండి: ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు బట్ట సంచుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించగా, కరీంనగర్ రూరల్, చొప్పదండి మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులకు ప్లాస్టిక్ వాడకం నివారణ లక్ష్యంగా బట్ట సంచుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంలో భాగంగా గాజు గ్లాసులలో టీ, స్టీల్ ప్లేట్‌లలో మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్‌ఎం లచ్చయ్య, మిల్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో సీసీఐ ఏర్పాటు చేసిన మిల్లులోని కొనుగోలు కేంద్రాల్లో శనివారం 13 మంది రైతుల నుంచి 228.75 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు సీసీఐ సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ తెలిపారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,995, కనిష్ఠ ధర రూ.6,784 పలికింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లు చేపడుతున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

వివాదాస్పదం.. కాంప్లెక్స్ నిర్మాణం

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని 50వ డివిజన్ పరిధి దోబీవాడలో నిర్మిస్తున్న ఓ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నివాస గృహాల మధ్య నిర్మిస్తున్న ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌తో ఇళ్లు దెబ్బతింటున్నాయని, ఇబ్బందులు పడాల్సి వస్తోందంటూ శనివారం డి.శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానికులు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. కమర్షియల్ కాంప్లెక్స్ కావడంతో పిల్లర్ కోసం చాలా లోతుగా తవ్వుతున్నారని, దీంతో పక్కనున్న ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. సైడ్ వాల్ కట్టుకొని నిర్మాణం చేయాల్సి ఉండగా.. నిర్మాణదారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించకుండానే అనుమతి ఇచ్చారని, తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.


పనులు జరుగుతున్న స్థలం ఇదే

శోభాయాత్ర

మానకొండూర్: నగర సంకీర్తన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వాములు చెరువుకట్ట నుంచి తూర్పు దర్వాజ వరకు స్వామివారి శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు గోశెట్టి సత్యనారాయణ, అపరాజు శ్రీనివాస్, కూన శంకర్, నరేందర్, బొల్లం శ్రీనివాస్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



చిడతల రామాయణానికి పూర్వవైభవం రావాలి

శంకరపట్నం: చిడతల రామాయణానికి గ్రామాల్లో పూర్వవైభవం రావాలని, ఇందుకు అన్నివర్గాల వారు ప్రోత్సహించాలని జిల్లా సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ అధ్యక్షుడు వంగ సుధాకర్ అన్నారు. మండలంలోని కన్నాపూర్ గ్రామంలో చిడతల రామాయణం పట్టాభిషేక కళాకారుల మహోత్సవ నాటక ప్రదర్శన శుక్రవారం అర్ధరాత్రి మూడో రోజు అంగరంగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో యక్షగానం, చిడతల రామాయణం కార్యక్రమాలు మరుగున పడిపోతున్నాయన్నారు. అలాంటి కార్యక్రమాలు చేపడుతున్న కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, ఎల్లారెడ్డి, నూనె రవి, సమ్మిరెడ్డి, సదానందం, రామచంద్రం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుధాకర్

నివేశన స్థలాలపై కొనసాగుతున్న ఆందోళన

జమ్మికుంట: మండలంలోని సైదాబాద్ గ్రామంలో 234 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో నివేశన స్థలాల కేటాయింపుపై శనివారం రెండోరోజు ఆందోళన కొనసాగింది. గతంలో పట్టాలు పొందిన వారు, డ్రా పద్ధతిలో నంబర్లు పొందిన లబ్ధిదారులు వారి ఇష్టానుసారంగా నివేశన స్థలాలను చదును చేసుకునేందుకు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు తహసీల్దార్ రజనీకి శనివారం ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి ఘటన స్థలం వద్దకు చేరుకొని, స్థలం చదును పనులు నిలిపివేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని, అప్పటి వరకు ఎవరూ కూడా సదరు స్థలంలోకి రావద్దని తెలిపినట్లు ఆర్‌ఐ తిరుపతి తెలిపారు.

ఆరు లీటర్ల నాటుసారా పట్టివేత


పట్టుబడిన నాటుసారా

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు 6 లీటర్ల నాటుసారా పట్టుకున్నారు. శనివారం గ్రామంలో జరిపిన ఆకస్మిక దాడుల్లో బోనగిరి మల్లేశ్ వద్ద 6 లీటర్ల నాటుసారా పట్టుబడిందని తెలిపారు. స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కుమార్ యాదవ్, కమలాకర్, కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

జమ్మికుంట: భూ వివాదం ఘటనను మనుస్సులో పెట్టుకొని దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మ్యాకమల్ల సుగుణ, మ్యాకమల్ల రత్నం, మ్యాకమల్ల భాస్కర్‌పై భూ వివాదం మనస్సులో పెట్టుకొని మ్యాకమల్ల వెంకటేశ్, మ్యాకమల్ల ప్రమీల, మ్యాకమల్ల రవి, మ్యాకమల్ల ఐలయ్య దాడికి పాల్పడ్డారు. బాధితురాలు సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు

ఇల్లందకుంట: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన సందర్భంగా శనివారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు టీం ఆధ్వర్యంలో ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ మాట్లాడుతూ, అయోధ్యకు శ్రీరాముడు రక్ష, తెలంగాణకు కేసీఆర్ రక్ష అని, రామచంద్రమూర్తి ఆశీస్సులు కేసీఆర్‌పై ఎళ్లవేళలా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాట్రేవుల అజయ్, రాపర్తి అరవింద్, వోల్లాల శ్రీకాంత్, చింతల కౌశిక్, రాకేశ్, అజయ్, రత్నాకర్, తిరుపతి పాల్గొన్నారు.


ఆలయ ఆవరణలో నాయకులు

నేదునూర్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

తిమ్మాపూర్: మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లి దండ్రులు- ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల హాజరు, బేసిక్స్ (చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు), విద్యార్థుల ప్రగతి గురించి చర్చించారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో, శుభ్రంగా వండాలని తల్లిదండ్రులు సూచించారు. సమావేశంలో నేదునూరు, లక్ష్మీదేవిపల్లి, వచ్చునూరు, గొల్లపల్లి గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు ఘనీ, అనీస్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు

పీవీ జిల్లా ఏర్పాటుకు కృషి : వొడితల ప్రణవ్


పీవీ జిల్లా సాధన సమితి నాయకులతో వొడితల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ కేంద్రంగా పీవీ జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో పీవీ జిల్లా సాధన సమితి నాయకులు అతడిని కలిశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, జిల్లా ఏర్పాటు చేసేందుకు తగిన కార్యాచరణను రూపొందించుటకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర మంత్రులను కలసి జిల్లా అంశాన్ని చర్చించుటకు జేఏసీ నాయకులతో కలిసి వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ భీమోజు సదానందం, నాయకులు పాడిశెట్టి వెంకటరాజం, పల్కల ఈశ్వర్‌రెడ్డి, ఈదులకంటి రవీందర్‌రెడ్డి, వేల్పుల రత్నం, ఆలేటి రవీందర్, డాక్టర్ తడికమల్ల శేఖర్, తిప్పారపు భువనచంద్ర, నమిండ్ల రవీందర్, రామ్‌రాజేశ్వర్, మిడిదొడ్డి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేశ్, ఎండీ రఫీ, రవి, కొమ్ముల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.